ముమ్మాటికీ కక్ష సాధింపే

- కేటీఆర్‌పై కేసులు పెట్టడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయం
- ఆగ్రహం వ్యక్తం చేసిన కార్పొరేటర్లు, నేతలు

కంది శైలజ
బౌద్ధనగర్ కార్పొరేటర్

హేమ
సీతాఫల్‌మండి కార్పొరేటర్

లింగాని ప్రసన్నలక్ష్మి
అడ్డగుట్ట కార్పొరేటర్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 20: కేటీఆర్‌పై కక్షగట్టి కేసులను బనాయించడం సిగ్గుచేటని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంపై నిలిపిన ఘనత కేటీఆర్‌దేనని కొనియాడారు. అందుకు అక్రమ కేసులను ప్రభుత్వం బహుమతిగా అందిస్తోందని దుయ్యబట్టారు. ఈ-ఫార్ములా రేసు ఒప్పందం రద్దు చేసుకున్న కారణంగా రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లడంతో పాటు నగరం, రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ డైవర్షన్ పాలిటిక్స్‌కు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెరలేపిందని ఆరోపించారు. ప్రజల దృష్టిని తమ హామీలపై మరల్చకుండా ఏదో ఒక అంశాన్ని తెరమీదకు తెస్తోందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కేసులు ముమ్మాటికీ అక్రమం

సికింద్రాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన కేసు ముమ్మాటికీ అక్రమం అని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తెలంగాణ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో మంట కలిసిందని ఆమె కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే కేసు నమోదు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి కొంతకాలం ప్రజల దృష్టి మళ్లించే కుట్రలు చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ కేసు పెట్టాల్సి వస్తే కాంగ్రెస్ ముఖ్యమంత్రిపై పెట్టాలని అన్నారు. అర్థ రహిత నిర్ణయం తీసుకొని రేసును అర్ధాంతరంగా రద్దు చేయడం వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఇలాంటి కుట్రపూరిత కేసులను రాజకీయంగా తాము ఎదుర్కొంటాం, న్యాయ స్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని, కాంగ్రెస్ నాయకులకు ప్రజాకోర్టులో బుద్ధి చెప్తామని ఆమె పేర్కొన్నారు.

నగర బ్రాండ్ ఇమేజ్ పెంచాలన్నదే కేటీఆర్ లక్ష్యం

అడ్డగుట్ట: నగర బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫార్ములా ఈ-రేసు నిర్వహణకు తీసుకున్నారని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలియజేశారు. కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసును ఆమె తీవ్రంగా ఖండించారు. నగర కేంద్రంగా పెట్టుబడులను పెంచి దాని నుంచి వచ్చిన ఫలాలను తెలంగాణ సంక్షేమానికి వినియోగించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని ఆమె తెలిపారు. ఈ-రేసు నిధుల కేటాయింపు సక్రమంగానే జరిగిందని, రెండు విడతల్లో అప్పటి ప్రభుత్వం నిర్వహణ సంస్థకు కేటాయించిందని ఆమె పేర్కొన్నారు. ఉద్యమం, పోరాటాల్లోంచి పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, ఇలాంటి కేసులకు భయపడేది లేదని ఆమె తెలియజేశారు.

కక్ష పూరితంగానే కేసు నమోదు

చిక్కడపల్లి, డిసెంబర్ 20: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై రేవంత్ సర్కార్ అక్రమ కేసులు బనాయించిందిని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ మండిపడ్డారు. శుక్రవారం గాంధీనగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పార్ములా ఈ-కారు రేసుతో తెలంగాణ కీర్తిని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసింది ఏమీ లేదన్నారు. హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని ఆయన విమర్శించారు. సర్కారు నిరంకుశత్వంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని సరైన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన విధంగా గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ముఠా జయసింహా, సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, రాకేశ్, శ్రీనివాస్ గుప్తా, గడ్డమీది శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, శ్రీకాంత్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో జూనియర్ డిప్లొమా, సీనియర్ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పేదల బస్తీల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 20: పేదల నివాసముండే బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ గంగపుత్ర సంఘం కార్యాలయంలో రోటరీ క్లబ్ హైదరాబాద్ ఈస్ట్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తమకు అందుబాటులోకి వచ్చే ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకుడు రాజాదీన్ యాదల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగి కార్యక్రమంలో ముఠా జయసింహా, ముచ్చకుర్తి ప్రభాకర్, శివముది రాజ్, రోటరీ క్లబ్ ఈస్టు ప్రెసిడెంట్ టీఎంఎన్ చౌదరి, ప్రాజెక్టు సర్వీసెస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రాదేశ్యాం తివారి పాల్గొన్నారు.

కథల లోగిలి కవితా సంకలనం ఆవిష్కరణ

కవితా సంకలనం ఆవిష్కరిస్తున్న మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి

ముషీరాబాద్, డిసెంబర్ 20: లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో లేఖిని రచయిత్రుల కథా సంకలనం కథల లోగిలి అవిష్కరణ కార్యక్రమం జరిగింది. మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. పొత్తూరి విజయలక్ష్మి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అత్తలూరి విజయలక్ష్మి, డాక్టర్ ఆర్.ప్రసన్నరాణి, వొలేటి పార్వతీశం, కందాళ ఉషారాణి, కామేశ్వరి, నాగమణి, గౌరీలక్ష్మి, వాసా భారతి, సరస్వతి పాల్గొన్నారు.

గాయకుడు ప్రభాకర్‌కు సత్కారం

గాయకుడు ప్రభాకర్‌ను సత్కరించిన పద్మశ్రీ కోట శ్రీనివాసరావు

ముషీరాబాద్, డిసెంబర్ 20: రాగరాగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఘంటసాల 102 జయంతిని పురస్కరించుకొని శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురిని అలరించింది. గాయనీ, గాయకులు ఆలపించిన మధురగీతాలు రంజింప చేశాయి. కార్యక్రమంలో సినీనటుడు, పద్మశ్రీ కోట శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్ని సినీయర్ గాయకుడు వి.ప్రభాకర్‌రావు సత్కరించారు. కార్యక్రమంలో మైన్స్ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, రాగరాగిణి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎంవీ రమణకుమారి, ప్రధాన కార్యదర్శి ఎంవీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లోని అమృత వాహని భవన్‌లో ఎలోహీం హీలింగ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బ్రదర్ పాట్రిక్ టీం ప్రతినిధులు పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలకు హాజరై సుమారు 800 మంది మహిళలకు నిత్యావసరాల కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ నాటికలను ప్రదర్శలతో అలరించారు. శాంటాక్లాజ్ బహుమతులు అందజేశారు. అనంతరం కరస్పాండెంట్ టీఏ రెడ్డి, డైరెక్టర్ అరుణరెడ్డి, ప్రిన్సిపాల్ సువర్ణ విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. – మారేడ్‌పల్లి/బొల్లారం:

పేదలకు నిత్యావసరాలు అందించిన కెనరా బ్యాంక్

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా కెనరా బ్యాంక్ కుందన్‌బాగ్ బ్రాంచ్ నేతృత్వంలో సిస్టర్స్ చారిటీ ట్రస్టీతో కలిసి శుక్రవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో 200 నిరుపేద కుటుంబాలకు రూ.2లక్షల విలువైన నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ డీజీఎం కె.బాలకృష్ణ, చీఫ్ మేనేజర్ జి.సత్యరమేశ్, మేనేజర్ బి.రవి, సీఆర్ఓ బి.నాగవల్లిలతో పాటు సిస్టర్స్ చారిటీ సిస్టర్ అల్ఫోన్సా వటోలి, విజిజోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై మండిపాటు

బన్సీలాల్‌పేట్‌లో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, తదితరులు

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 20: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు అన్నారు. ముందుగా బన్సీలాల్‌పేట్‌లోని బాబాసాహేబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం జంట విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతరత్న అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే ప్రభుత్వాలు నడుస్తున్నాయని, పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు దేశ ప్రజలందరినీ ఎంతో ఆవేదనకు గురి చేశాయని అన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, నగర నాయకులు మహేందర్, అశోక్, లింగం, మహేశ్, కుమార్, అఖిల్, నాగభూషణం, శ్రీకాంత్, జగదీశ్‌లు పాల్గొన్నారు.

'మేథమేటిక్స్ ఎంతో కీలకమైంది'

సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 20: అన్ని రంగాల్లో మేథమేటిక్స్ ఎంతో కీలకమైందని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి అన్నారు. మేథమేటిక్స్ థియరీస్ వల్లనే ఈనాటి కంప్యూటర్ సైన్స్ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. రామానుజన్ జయంతి సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ మేథమేటిక్స్ విభాగంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. 'మేథమేటిక్స్ ఇన్ ద మాడర్న్ వరల్డ్: అప్లికేషన్స్ అండ్ చాలెంజెస్' అంశంపై నిర్వహిస్తున్న సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రామానుజన్ కనుగొన్న థియరీస్ ఎంతో ఘనమైనవని అన్నారు. మేథమేటిక్స్ అన్ని విభాగాల్లోనూ ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. కామర్స్‌లో సైతం మేథమేటిక్స్ అప్లికేషన్‌తో ఎంతో ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. విద్యార్థులు ప్రాథమిక మేథమేటిక్స్ అప్లికేషన్స్‌లో పట్టు సాధించాలని సూచించారు. మేథిమేటిక్స్ విభాగంలో మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం అతిథులు సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ పద్మావతి, సదస్సు కన్వీనర్ కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ నాగరాజు, కోకన్వీనర్ ప్రొఫెసర్ హరిసింగ్, ప్రొఫెసర్లు కిషన్, సురేందర్‌రెడ్డి, ధనలక్ష్మి, ఫణీంద్ర, కిరణ్, వెంకటలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

చిక్కడపల్లి, డిసెంబర్ 20: చిక్కడపల్లిలో ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం బి.సరేఖ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాథం, ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్ మాట్లాడుతూ రూ 2,10,330 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ముఖ్య అర్చకులు బుగ్గలక్ష్మి పతిశర్మ, కమిటీ సభ్యులు హరీశ్, సుబ్బారావు, ఎన్.శ్యామ్ ఎ.బాలకుకమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాన్‌షాపులో అగ్ని ప్రమాదం చెలరేగిన మంటలు

ప్యాట్నీ సెంటర్‌లోని పాన్‌షాపులో చెలరేగుతున్న మంటలు

బేగంపేట్, డిసెంబర్ 20: సికింద్రాబాద్ మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో ఓ పాన్‌షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ సమీపంలో తాజ్ ట్రైస్టార్ హోటల్ ఎదురుగా ఉన్న ఓ నూతన పాన్ షాపు యజమాని గురువారం రాత్రి దేవుడికి దీపం పెట్టి షాపు మూసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి తర్వాత దట్టమైన పొగలు, మంటల చెలరేగాయి. గమనించిన స్థానికులు, పోలీసులకు, అగ్ని మాపక అధికారులకు సమాచారం అందించారు. దీంతో ప్యారడైజ్ ఫైర్ స్టేషన్ అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. మహంకాళి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంత్ గాడ్గే బాబా ఆశయ సాధనకు కృషి

చంపాపేట, డిసెంబర్ 20: సంత్ గాడ్గే బాబా స్వచ్ఛభారత్ పితామహుడని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం సంత్ గాడ్గే వర్ధంతి సందర్భంగా చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో భగత్‌సింగ్ యువజన సంఘం, బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. శ్రీనివాస్ హాజరై బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాబా స్వచ్ఛభారత్ పితామహుడని, చరిత్రలో పరిశుభ్రతే దైవమని నమ్మి చీపురుతో వీధుల్ని, కీర్తనలతో మస్తిష్కాలను శుభ్రం చేసిన వాగ్గేయకారుడన్నారు. గుడికి బదులు , బడిలో దొరికే ఆధాత్మికథను వెతుక్కోవాలని సమాజానికి చాటి చెప్పిన తొలి సంఘ సంస్కర్త అని అన్నారు.

ఆటో కార్మికుల చలో అసెంబ్లీ విజయవంతం

చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

సికింద్రాబాద్, డిసెంబర్ 20: చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి సికింద్రాబాద్ నుంచి ఆటో డ్రైవర్లు భారీగా తరలివెళ్లారు. ముందుగా సీతాఫల్‌మండి చౌరస్తా నుంచి ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు మహ్మద్ ఉమర్‌ఖాన్ ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మీటర్ చార్జీలను పెంచాలని, సంవత్సరానికి 12000 గౌరవ వేతనం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హామీల సాధనకు చలో అసెంబ్లీ పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు భిక్షపతి యాదవ్, ప్రవీణ్‌కుమార్, సక్రునాయక్, రాజ్‌కుమార్, మహమ్మద్ షకీల్, తదితరులను అరెస్టు చేసి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు నాయకులు తెలిపారు.

మజ్దూర్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకర్‌రావు, తదితరులు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 20: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ 74వ వార్షికోత్సవ సమావేశాలు శుక్రవారం సికింద్రాబాద్ రైల్ కళారంగ్‌లో అట్టహాసంగా జరిగాయి. జోనల్ వర్కింగ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జోనల్ అధ్యక్షుడిగా మరోసారి కాల్వ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ శంకర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళీధర్, కోశాధికారిగా సరోజినీరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీలుగా ఉదయభాస్కర్, భారటే, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా సికింద్రాబాద్ డివిజనల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ ఖాజబాబా, కార్యదర్శి రవీందర్, అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీలుగా చిలుకు స్వామి, పీఎన్ శ్రీనివాస్‌రావు, నాగలక్ష్మి, రమేశ్‌కుమార్, సభ్యులుగా బచ్చలి శ్రీనివాస్, నవనీత్‌సింగ్ ఎన్నికైయ్యారు. విలేకరుల సమావేశంలో మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకర్‌రావు మాట్లాడుతూ రైల్వే కార్మికుల కష్టాలను ప్రత్యేక్షంగా చూశానని, వారి హక్కుల సాధన కోసం నిరంతరం మజ్దూర్ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ పలు డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌జీపీఏటీ డైరీ ఆవిష్కరణ

డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చిక్కడపల్లి, డిసెంబర్ 20: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏటీ) హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అసోసియేషన్ 2025 డైరీ ఆవిష్కరణ శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి, అఖిల భారత స్టేట్ పెన్షనర్స ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డి.సుధాకర్ హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెన్‌సనర్స్ జేఏసీ సెక్రటరీ జనరల్ శుభాకర్, రచయిత్రి జూపాక సుభద్ర, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స కార్యదర్శి ఎం.వి.నరసింగరావు, అర్థిక కార్యదర్శి బెరి నర్సయ్య, ఉపాధ్యాయులు వి.రమ మనోహర్, సంఘం జిల్లా హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు పి.కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 20: దివ్యాంగుల కోసం జూనియర్, డిగ్రీ కాలేజీ నిర్మించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డీఎన్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు పల్ల భనేని ప్రసాద్ అన్నారు. మలక్‌పేట్‌లో దివ్యాంగుల సంక్షేమ భవన అవరణలో కళాశాల, హాస్టల్ నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని గురువారం ఐఏఎస్ అనితా రామచంద్రన్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

యశ్వంత్‌పూర్ రైల్లో యువతి అదృశ్యం

హేమవతి

కాచిగూడ, డిసెంబర్ 20: కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఓ యువతి అదృశ్యమైంది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా హెమ్మిగనూర్‌కు చెందిన నారాయణ కూతురు ఎం.హేమవతి(25) ప్రైవేటు ఉద్యోగి. శుక్రవారం కూతురు హేమవతితో కలిసి తండ్రి యశ్వంత్‌పూర్-ఎలహంక రైల్లో కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం-4లో దిగారు. తండ్రికి బాత్‌రూమ్‌కు వెళ్లివస్తానని చెప్పిన కూతురు అదృశ్యమైంది. వెంటనే తండ్రి నారాయణ కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ రైల్వే హెచ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపారు.